క్లుప్తంగా

రూ.10వేలు విరాళం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ విరాళాలను అందజేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం పట్టణానికి చెందిన మాజీ వార్డు కౌన్సిలర్ కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి, నీరజ దంపతుల కుమారుడైన కంచరకుంట్ల రాహుల్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కు రూ 10 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) చేతుల మీదుగా క్యాంటీన్ నిర్వాహకులు మైనేని రాధాకృష్ణకు అందజేశారు.

చిల్లకల్లు ఎస్‌ఐగా సూర్య శ్రీనివాస్ బాధ్యతలు



జగ్గయ్యపేట: చిల్లకల్లు ఎస్‌ఐగా తోట సూర్య శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సతీష్ పడమట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా, పెడన ఎస్‌ఐగా పనిచేస్తున్న సూర్య శ్రీనివాస్ బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ఇసుక, రేషన్ బియ్యం, గ్రావెల్ అక్రమ రవాణా నియంత్రణకు కృషి చేస్తామని వివరించారు.

సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



జగ్గయ్యపేట అర్బన్: శ్రావణ మాస ఉత్సవాలను జగ్గయ్యపేట పట్టణంలోని శ్రీముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన మణికుమార్, కొత్తా రమేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు నోముల శివకుమార్, కొంకిమళ్ల సురేష్, అప్పన వెంకట పిచ్చయ్య, సభ్యులు చేడె శ్రీరంగం, నాగ ప్రసాద్, ఆరేపల్లి వెంకటేశ్వర్లు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు అవగాహన



అనుమంచిపల్లి(జగ్గయ్యపేట): రైతులు అధునాతన వ్యవసాయ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ భవాని సూచించారు. మండలంలోని అనుమంచిపల్లిలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పొలం వద్ద వ్యవసాయంలో పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను పాటించడం ద్వారా కలిగే లాభాలను వివరించారు. మెట్ట, మాగాణి అధికంగా ఉందని రైతులు అందుకనుగుణంగా సాగు చేపట్టాలని ఏడీఏ సూచించారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, వీఏవోలు పాల్గొన్నారు.

నందిగామ ట్రాఫిక్ ఎస్‌ఐగా నరేష్

నందిగామ టౌన్: నందిగామ ట్రాఫిక్ ఎస్‌ఐగా నరేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ట్రాఫిక్ పోలీసు సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ట్రాఫిక్ ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ నందిగామ పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వాహనాలు సీజ్ చేయటంతోపాటు వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుండపోత వర్షం

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో గురువారం సాయంత్రం కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రెండు గంటల పాటు ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. వర్షం నేపథ్యంలో గంటపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఈ వర్షం మొక్కజొన్న, పత్తి, మినుము, వరి పంటలకు అనుకూలమని రైతులు తెలిపారు. వర్షపు నీటిని పంట పొలాల్లో నిల్వ ఉండకుండా చూసుకోవాలని కంచికచర్ల మండల వ్యవసాయ అధికారి కె. విజయకుమార్ రైతులకు సూచించారు.

ఘనంగా మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు



జెడ్పీ బాలికల హైస్కూల్‌లో కేక్ కట్‌చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు కేక్ తినిపిస్తున్న సామినేని ఉదయభాను, పక్కన కౌన్సిలర్లు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర జన్మదిన వేడుకలను పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర, మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను నివాసానికి వెళ్లి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం చిల్లకల్లు రోడ్‌లోని మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర నివాసానికి వెళ్లిన ఉదయభాను కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తుమ్మల ప్రభాకర్, షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. బర్త్‌డే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. రాఘవేంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినవారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు, కార్మికులు, సిబ్బంది ఉన్నారు.

బాలికల పాఠశాలలో..

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర స్థానిక జెడ్పీ బాలికల హైస్కూలోని విద్యార్థుల సమక్షంలోజన్మదిన వేడుకలు జరుపుకున్నారు. బాలికల్లో విద్యాభివృద్ధి, వారి భద్రతకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన కౌన్సిలర్లతో కలిసి స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. త్రిపురవరం గ్రామంలోని గోసేవ కేంద్రాన్ని సందర్శించి గోవులకు కావాల్సిన ఆహారాన్ని అందించారు.

కాలిబాటలతో తెగుళ్లు దూరం

వరిసాగుపై రైతులకు ఏవో సూచనలు



ఆక్లూరుపాడులో కాలిబాటలు చేసిన వరిపొలం

వత్సవాయి : వరిపంటలో కాలిబాటలు చేసుకోవడం ద్వారా పంటకు తెగుళ్లు ఆశించకుండా కాపాడుకోవచ్చునని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. వరి పంటను దగ్గర, దగ్గరగా ఎక్కువ నారుతో కుచ్చులు, కుచ్చులుగా నాటితే తెగుళ్లు అధికంగా సోకే అవకాశం ఉంది. పంట పెరుగుతున్న కొద్దీ గాలి, వెలుతురు సక్రమంగా తగలకపోవడంతో పలురకాలైన తెగుళ్ల పంటను ఆశిస్తాయి. తెగుళ్లు బారినపడకుండా ఉండాలంటే వరిలో కాలిబాటలు వేసుకుంటే గాలి, వెలుతురు సక్రమంగా పంటకు తగలడంతోపాటు పంట కూడా ఏపుగా పెరిగే అవకాశం ఉంది. వరిలో కాలిబాటల ఏర్పాటుతో అధిక ప్రయోజనాలు ఉన్నాయని వత్సవాయి మండల వ్యవసాయాధికారి(ఏవో) వి. రవికుమార్ వివరించారు.

కుచ్చులుగా నాట్లు వేయరాదు..

వరినాట్లు వేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలి. నారను ఎక్కువగా కుచ్చులుగా నాటకుండా ఉండేలా రైతులు జాగ్రత్తపడాలి. పంట ఒత్తుకావడంతో తొందరగా చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. సాధారణంగా రైతులు వరినారును ఎక్కువగా పెట్టి నాటితే దిగుబడులు వస్తాయని ఆశిస్తారు. కానీ ఇది సరైన పద్ధతికాదు. నాట్లు దగ్గరగా వేస్తే దిగుబడులు తగ్గడంతోపాటు పంటకు సుడిదోమ, అగ్గితెగులు వంటివి ఆశించి పంటను నాశనం చేస్తాయి. ఎన్నిమందులు పిచికారీ చేసినా అది పంట మొదళ్లకు తగలకపోవడంతో చీడపీడలు అదుపులోకి రావు.

కాలిబాటతో ఉపయోగాలు...

- వరిపంటలో కాలిబాటల ఏర్పాటుతో పంటకు కావలసిన సూర్యరశ్మి సక్రమంగా అందుతుంది. తద్వారా తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనే వీలుంది. ప్రతి రెండు మీటర్లకు 20సెంటీమీటర్ల చొప్పున దూరం వదిలి కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి.
- కాలిబాటలతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది. పంట ఏపుగా పెరుగుతుంది.
- భూమిలో మందుతోపాటు పైమందులు పిచికారీ చేసేటప్పుడు ఇబ్బంది లేకుండా కాలిబాటలో నడుచుకుంటూ పనిచేసుకోవచ్చు.
- కలుపును సులభంగా తొలగించుకునే అవకాశం ఉంది. ఈ విధానంతో కూలీల ఖర్చులు కూడా తగ్గుతాయి.
- ముఖ్యంగా వరి పంటలో ఎలుకల దాడి ఎక్కువ, కాలిబాటలో అక్కడక్కడా మందు పెడితే ఎలుకల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చు.

రైతులు అలవాటుచేసుకోవాలి



వరిలో కాలిబాటల విధానాన్ని రైతులు అలవాటు చేసుకోవాలి. తద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. మందు చల్లేటప్పుడు పిచికారీ చేసేటప్పుడు కాలిబాటలో నడవడవచ్చు. చీడపీడలు కూడా తొందరగా అశించవు. పెట్టుబడులు తగ్గి దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉంది.

– వి రవికుమార్ ఏవో

- వరి పంట కోత సమయంలో అకాల వర్షాలు, ఈదురుగాలులకు పంట వాలిపోతే కాలిబాటల సాయంతో పంటను తిరిగి నిలబెట్టడానికి అవకాశం ఉంది.

నేడు గ్రామసభలు

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిహర్ష గురువారం తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో సభలు నిర్వహించి, ఆయా పనులను గుర్తిస్తామని తెలిపారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని ఆయన సూచించారు.

నేడు చిల్లకల్లుకు కలెక్టర్..

జగ్గయ్యపేట మండలం చిల్లకల్లులోని పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం పదిగంటలకు నిర్వహించనున్న గ్రామసభలో జిల్లా కలెక్టర్ సృజన పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు. గ్రామస్తులు, ఆయాశాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

కులంపేరుతో దూషించాడని ఎమ్మెల్యే ఫిర్యాదు

నందిగామ టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకుడు, ముస్లిం చైతన్య వేదిక అధ్యక్షుడు షేక్ కరిముల్లా (దుబాయ్ కరిముల్లా)పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ వైవిఎల్ నాయుడు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ మాట్లాడుతూ షేక్ కరిముల్లా తనను కులం పేరుతో దూషించినట్టు నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం ప్రాథమిక విచారణ అనంతరం వివరాలు సేకరించి పంపించారు. ఈ కేసును డీఎస్పీ స్థాయి అధికారి పూర్తిస్థాయి విచారణ చేపడతారని తెలిపారు. ఈ ఘటనపై కరిముల్లా మాట్లాడుతూ కక్ష్య సాధింపులో భాగంగానే తనపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తంచేశారు.

● దోమల దండుయాత్రకు 'తెర'



నగరంలో దోమలు దండయాత్ర చేస్తున్నాయి. ఈడా ఉంటా.. ఆడా ఉంటా అంటూ ఇంటి బయట, లోపల, సెంటర్లో, రోడ్డుపై ఇలా అన్ని చోట్లా స్వైర విహారం చేస్తున్నాయి. దోమలను అదుపు చేయాల్సిన విజయవాడ నగరపాలకసంస్థ చోద్యం చూస్తోంది. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇంట్లో ఉండే వారు కాకుండా రాత్రి సమయాల్లో వివిధ మాల్స్, కాంప్లెక్స్ వద్ద సెక్యూరిటీ ఉద్యోగాలు చేసే వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది. దోమల దండు బెంబేలెత్తిస్తుండటంతో ఒక చోట కూర్చోలేక, నిలబడలేక అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో ఒక సెక్యూరిటీ గార్డు వినూత్నంగా ఆలోచించాడు. మంచానికి ఉండే దోమ తెరను తన కుర్చీ చుట్టూ పరుచుకున్నాడు. విజయవాడ బందరు రోడ్డులోని ఓ షోరూం వద్ద గురువారం తెల్లవారుజామున సాక్షి కెమెరా ఈ చిత్రాన్ని క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

30న సామూహిక లక్ష కుంకుమార్చన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసిన శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో 30వ తేదీన విశేష పూజలు, హోమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ పేర్కొన్నారు. శ్రావణ మాసం నాల్గో శుక్రవారాన్ని పురస్కరించుకుని 30వ తేదీ అమ్మవారికి 108 మంది దంపతులతో సామూహిక లక్ష కుంకుమార్చన, చండీహోమం, లక్ష్మీ గణపతి హోమం, మహా పూర్ణాహుతి జరుగుతోంది. అనంతరం భక్తులకు అమ్మవారి అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రత్యేక పూజలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు, క్యూలైన్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

జగ్గయ్యపేట: తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను శుక్రవారం స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే మండలంలోని అనుమంచిపల్లి ఇసుక స్టాకు పాయింట్ నుంచి రెండు ట్రాక్టర్‌లు అన్నవరం గ్రామానికి కూపన్ ద్వారా ఇసుక తీసుకెళ్తున్నాయి. అయితే గ్రామంలో ఇసుక డంప్ చేయాల్సి ఉండగా తెలంగాణలోని రెడ్లకుంట గ్రామానికి వెళ్తునట్లు కానిస్టేబుల్ రమేష్ గుర్తించి సదరు ఇసుక ట్రాక్టర్లను అడ్డగించారు. అనంతరం చిల్లకల్లు పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫీల్డ్‌అసిస్టెంట్లతో సమావేశం

వీరులపాడు: మండలంలో ఈ ఏడాది చేపట్టనున్న ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం శుక్రవారం ఆయా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో జనార్దన్ తెలిపారు. వీరులపాడులోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గురువారం ఆయన మండలంలోని ఫీల్డ్‌అసిస్టెంట్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల సర్పంచుల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించి పనులు గుర్తించనున్నట్లు వివరించారు. మండలంలోని జాబ్‌కార్డులు కలిగిన 12వేల మందికి కూలీలు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషిచేయాలని సూచించారు.

రిటైర్డ్ ఇంజనీర్ సీతారామయ్య కన్నుమూత



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): రాష్ట్ర విద్యుత్ సంస్థ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ సూరపనేని సీతారామయ్య (86) గురువారం ఉదయం కన్నుమూశారు. ఈయన కంకిపాడు మండలం, మారేడుమాక గ్రామంలో కేశవ నారాయణ, సరస్వతమ్మకు 1939లో జన్మించారు. ఈయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. బెంగళూరులో బీఈ ఎలక్ట్రికల్ చదివారు. నార్ల తాతారావు వంటి ప్రముఖులతో కలిసి సీతారామయ్య పనిచేశారు. విజయవాడ థర్మల్ కేంద్రం 4, 5 యూనిట్లను 18 నెలల కాలంలో పూర్తి చేశారు. రిటైరైన తరువాత కూడా దేశంలోని వివిధ కంపెనీల్లో సీతారామయ్య 75 ఏళ్లు వచ్చే వరకు నిర్విరామంగా విధులు నిర్వర్తించారు. కొండపల్లి లాంకో పవర్ స్టేషన్, నాగపూర్‌లోని పవర్ ప్లాంట్, రాజస్థాన్‌లోని సూరత్ ప్లాంటు, పానిపట్ పవర్ ప్లాంట్ మొదలైన ప్రాజెక్టుల్లో ఈయన పనిచేశారు. మారేడుమాకలో 33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోదరురుడైన డాక్టర్ రామబ్రహ్మంతో కలసి సీతారామయ్య భూమిని దానంగా ఇచ్చారు. గురునానక్ కాలనీలోని డాన్‌బాస్కో స్కూల్ ఆవరణలో భౌతికఖాయాన్ని ఉంచామని, అంత్యక్రియలు శనివారం జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యార్థులకు 'సుమమాల' ఆర్థిక చేయూత



విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్న సుమమాల సేవాసంస్థ సభ్యులు

కంచికచర్ల : పేదవిద్యార్థుల్లో విద్యాభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు అండగా నిలుస్తుండటం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపల్ హఫీజ్ షేక్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 25మంది విద్యార్థుల ఫీజుల నిమిత్తం విజయవాడకు చెందిన సుమమాల సేవా సంస్థ సభ్యులు రూ.50వేల నగదు చెక్కును గురువారం అందజేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. పేద విద్యార్థులకు ప్రభుత్వాలు అనేక రాయితీలు ఇస్తున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటును సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. విద్యాభివృద్ధికి కృషిచేస్తున్న సుమమాల సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సుమమాల సేవాసంస్థ అధ్యక్షుడు కనిగంటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు రిటైర్డ్ ప్రిన్సిపాల్ జాన్‌రత్నం, కార్యదర్శి శిఖినం షాలేమురాజు, ట్రెజరర్ తెనాలి సాయిబాబు, సలహాదారులు టీపీ బాబు, మిషాక్ గోపి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



పేటలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: కలకత్తాలోని ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ నూతన చట్టాల అమలు ద్వారా నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో న్యాయవాదులు బత్తుల వెంకట్రామయ్య, కాసరగడ్డ నాగేశ్వరరావు, కరణం నరసింహారావు, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, ఎం.కృష్ణయ్య, ధనుంజయుడు, కాంతారావు, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, పూల నాగరాజు, దాసరి నాగేశ్వరరావు, బసవరాజు, కరిసె రత్నబాబు, శ్రీనివాసవి, శేషకుమారి, అమ్ములు, ఏజీపీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యువత ఆధ్వర్యంలో చిరంజీవి జన్మదిన వేడుకలు



చిరంజీవి బర్త్ డే వేడుకల్లో పాల్గొన్న చినబాబు, గోవింద్, చిరంజీవి యువత ప్రతినిధులు

జగ్గయ్యపేట అర్బన్: ప్రముఖ సినీనటుడు చిరంజీవి జన్మదిన వేడుకలను జగ్గయ్యపేట పట్టణంలో గురువారం చిరంజీవి యువత పేట నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపునేని గోవింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేడుకలకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సోదరుడు శ్రీరాం చినబాబు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, న్యాయవాది పసుపులేటి సత్యశ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్ నూకల సాంబ, మున్సిపల్ మాజీ కోఆప్షన్ సభ్యుడు చౌడవరపు జగదీష్ తదితరులు హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి మాజీ అధ్యక్షుడు గోగుశెట్టి మహేష్, రాష్ట్ర చిరంజీవి యువత అధ్యక్షులు సయ్యద్ మౌలాలి, ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ మోసిన్ అహ్మద్, జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా సంయుక్త కార్యదర్శి ఈమని కిషోర్‌కుమార్, పేట పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున్, పట్టణ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు నరసింహరాజు, సుధీర్, జయంతిపురం గ్రామసర్పంచి నరసింహ నాయక్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితులకు శాశ్వత పరిష్కారం చూపాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు ప్రాంతంలో కిడ్నీ బాధితుల సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏ. కొండూరు, గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట, మైలవరం తదితర మండలాల పరిధిలోని గ్రామాల్లో కిడ్నీ వ్యాధితో వందల మంది పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. ఈ ప్రాంతం మరో ఉద్దానంలా తయారవుతోందన్నారు. దీని బారి నుంచి భవిష్యత్ తరాలను కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు తక్షణం అఖిలపక్ష కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్దానం తర్వాత అత్యధికంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఏ.కొండూరు మండలంలోనే ఉన్నారన్నారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాల్లో లభించే నీటిలో సిలికాన్, ఫ్లోరైడ్ పరిమాణం ప్రమాదకర స్థాయిలో ఉందన్నారు.కిడ్నీ ఆసుపత్రి వెంటనే నిర్మించాలని, శుద్ధి చేసిన కృష్ణా నీటిని కుళాయిల ద్వారా ఇంటింటికీ అందించాలని, కిడ్నీ బాధితులకు రూ. 5 వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల పరిష్కారం కోసం తమ పార్టీ బాధితుల పక్షాన 24వ తేదీ శనివారం మండల కేంద్రం ఏ. కొండూరులో ధర్నా నిర్వహిస్తామన్నారు. సమస్య తీవ్రతపై అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామన్నారు. వ్యాధిగ్రస్తులకు, డయాలసిస్ పేషెంట్లకు ఉచితంగా అన్ని రకాల మందులు పంపిణీ చేయాలన్నారు. డయాలసిస్ పేషెంట్లకు ఇస్తున్న పెన్షన్‌ను రూ. 20 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు, కళ్యాణ్, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థి సత్తా



నితీష్ నాగసాయిని అభినందిస్తున్న కళాశాల చైర్మన్ రమేష్‌బాబు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): హరియానాలోని దేవిలాల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ నెల 16 నుంచి 18 తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా కరాటే చాంపియన్ షిప్–2024 పోటీల్లో తమ కళాశాల ఇంటర్ విద్యార్థి పి.నితీష్ నాగసాయి ప్రథమ బహుమతి పొందాడని శారదా విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.రమేష్ బాబు చెప్పారు. స్థానిక జమ్మిచెట్టు సెంటర్ సమీపంలో ఉన్న కళాశాల ఆవరణలో నితీష్ నాగసాయిని అభినందించే కార్యక్రమం గురువారం జరిగింది. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు చదువులోనే కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో కూడా ప్రతిభ చూపుతున్నారని రమేష్‌బాబు అన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదాదేవి మాట్లాడుతూ ఇకపై జరిగే పోటీల్లో కూడా నితీష్ నాగసాయి మరిన్ని బహుమతులను గెలుచుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల సలహాదారుడు ఈఎస్ఆర్‌కే ప్రసాద్, కళాశాల జనరల్ మేనేజర్ జీవీ రావు మాట్లాడుతూ ఆటలతో మానసిక, శారీరక ఆరోగ్యం పొందవచ్చని అందువల్ల తమ కళాశాలలో విద్యతో పాటుగా క్రీడలకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ప్రతిభ చూపిన పి.నితీష్ నాగ సాయిని కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.